


# గొడుగు

ఎం.వి.ఎస్.ఎస్. ప్రసాద్

"ఆయన మళ్ళీ వచ్చారండీ" అంది శైలజ తన భర్త సుందరంతో.

"ఎవరూ?" అంటూ క్వశ్చన్ మార్కులా మొహం పెట్టాడు గెడ్డం గీసుకుంటున్న సుందరం.

"అదేనండి వినాయకరావు. పాపం, రోజూ ఏదో టైములో వస్తూనే ఉన్నాడు. ఇంతకీ ఆయనకి మీతో పని ఏమిటట?"

"ఏముంది మామూలే. మా కంపెనీలో ఉద్యోగం వేయించమని చంపుకుతింటున్నాడు. ఏదో మనవాడే కదా అని చూద్దాం అన్నాను. ఇక అప్పటినుంచీ వదలడంలేదు. అయినా అవసరం అతనిది, ఒకసారి కాకపోతే వందసార్లు వస్తాడు. కూచోమను. వస్తున్నాను."

"అలాగే !" అని డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి వినాయకరావుని కూచోమని చెప్పి, తను వంటింట్లోకి వెళ్ళింది శైలజ.

సుందరం ఒక కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. వేలమీద జీతం. మంచి పలుకుబడి గల ఉద్యోగం, ఎవరికైనా ఉద్యోగం సంపాదించడం దగ్గరనుంచీ ట్రాన్స్‌ఫరు దాకా చేయించగలడు. సుందరం ఎవరు ఏమి అడిగినా కాదనడు. కానీ, చాలా సందర్భాలలో ఆయా వ్యక్తులకు ఏమీ చేయకపోవడం, వాళ్ళు బాధపడడం మామూలే.

వినాయకరావు అతనికి బాగా దూరపు చుట్టం. చాలా పేదవాడు. డిగ్రీ పాసయ్యాడు. అతను ఆలస్యంగా పుట్టడంచేత తండ్రి రిటైరు అయినా ఇంకా జీవితంలో స్థిరపడలేదు. అతను సుందరం పని చేసే కంపెనీలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఆ విషయమై సుందరం సహాయం అర్థించాడు. సుందరం అలవాటు ప్రకారం "అదెంత పని?" అన్నాడు. దాంతో వినాయకరావు చాలా ఆశతో ఉన్నాడు.

"హలో !" అన్నాడు సుందరం డ్రాయింగ్ రూమ్‌లో అడుగు పెడుతూ.

వినాయకరావుకి ఏమనాలో తెలియలేదు. ఒకసారి నవ్వి - "మీ గురించి రెండు మూడుసార్లు వచ్చాను. మీరు లేరని..." నసిగాడు.

"ఆఁ, శైలజ చెప్పింది. ఏదీ అసలు ఖాళీ ఉండడంలేదు. మా వాళ్ళా సేల్స్ టార్గెట్స్ విపరీతంగా పెంచేస్తున్నారు. ఏదో వాళ్ళు అంకెలు వేసేస్తారు గానీ, అమ్మకాలు పెరగాలి కదా ! ఆ హడావిడిలో ఈమధ్య భోజనానికి కూడా సరిగ్గా రావడంలేదు."

"మీ మిసెస్ చెప్పారు. నా విషయం ఏమైందో కనుక్కుందామని వచ్చాను. ఒకవేళ మీరు కుదరదంటే మరెక్కడైనా..."

"నో నో ! నేను తలుచుకోవడం, అవకపోవడం ఉండదు. అన లీపాటికి అయిపోయి ఉండేదే. మా ఎం. డి. అన్నాలు ఊళ్ళో ఉండడం లేదు. ఒకవేళ ఉన్నా మీటింగులూ, కాన్ఫరెన్సులతోటే సరిపోతోంది. విడిగా కలుసుకోవడం కుదరడంలేదు. మీరు ఇంకొంతకాలం ఆగాలి. మిగతా ప్రయత్నాలేమీ చెయ్యకండి, అనవసరంగా అప్లికేషన్లకూ, పోస్ట్ ఖర్చులకూ డబ్బు దండగ."

సుందరం ఆవిధంగా మాట్లాడడంతో వినాయకరావుకి ఆశ పది రెట్లయింది. ఎందుకంటే ఇదివరకు ఒకటి రెండుసార్లు 'చూద్దాం, చేద్దాం' అన్నాడు గానీ, ఇంత ఆశాజనకంగా మాట్లాడలేదు.

"మీ చేతిలో పెట్టాను. మీదే భారం. మా ఊరులో కంపెనీలో ఏదో చిన్న పోస్టు ఇస్తా నన్నారు. జీతం తక్కువ. అదీగాక రెండు సంవత్సరాలు బాండు రాయాలిట. ఈ లోపల మంచి ఉద్యోగం వచ్చినా వెళ్ళడానికి కుదరదు. అందుకని ఆలోచిస్తున్నాను."

"దాని సంగతి మరిచిపొండి. నేను చెప్పానంటే చేసినట్టే. కాకపోతే కాస్త టైము పట్టవచ్చు. ఓకే?" మీ రిక వెళ్ళవచ్చని హావభావాలతో సూచించాడు సుందరం.

"మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు?"

"మీ రిటు వచ్చినప్పుడు రండి. అఫ్‌కోర్సు మీరు తరుచూ కనుక్కుంటూ ఉంటే నాకూ కాస్త గుర్తు చేసినట్టు ఉంటుంది." అని లోపలికి నడిచాడు సుందరం.

వినాయకరావు ఆకుల్లా అరిగిపోయిన హవాయి చెప్పులు తొడుక్కుని బయటికి నడిచాడు. అతని మనసులోని ఆశ ఇన్నాళ్ళకు ఒక కచ్చితమైన రూపం దాల్చింది. ఉద్యోగంలో రిటైరై, జీవితంలో రిటైరవడానికి సిద్ధంగా ఉన్న తండ్రి... తల్లి లేని లోటు లేకుండా తనని పెంచిన తండ్రి గుర్తుకు రాగానే అతని కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

ఆయన పస్తులుండి తనను, అన్నయ్యను పెంచి పెద్ద చేశాడు. ఇద్దరికీ చదువులు బాగానే వచ్చాయి. అన్నయ్యకు ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. కన్న తండ్రికి కూడా చెప్పకుండా తనకు నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని, తండ్రితోనూ, తమ్ముడితోనూ సంబంధం తెంచేసుకున్నాడు. పెన్షను లేని ఉద్యోగం కదా పెద్ద కొడుకు చేతి కందాడు అనుకున్న తండ్రికి ఆ సంఘటన అశనిపాతం అయింది. ఆయన బాగా క్రుంగిపోయాడు. తనకి ఉద్యోగం లేదు. ఇంట్లో పిల్లి పొయ్యిలోంచి లేవడం గగనమైపోతోంది.

ఒక సైనికుడికి సరిహద్దులో పోస్టింగ్ వేశారు. అతను ఒంటరిగా కవలా కాస్తూ ఉండాల్సి వచ్చింది. ఒంటరితనాన్ని భరించలేక అతను చిలకను పెంచి దానికి మాటలు నేర్పాడు. రోజూ దానితో కబుర్లు చెవుతూ కాలం గడిపేవాడు.

ఒక రోజు మాటలు నేర్చిన చిలక "అదిగో అందమైన అమ్మాయి అటుగా పోతోంది" అంటూ పెద్దగా అరిచింది.

వంటరి సైనికుడు అటువైపు పరుగెత్తాడు. కాని అతనికి అక్కడ ఎవరూ కనిపించలేదు.

మర్నాడు సైనికుడు హాయిగా తిని నిద్రిస్తున్న వేళ చిలక మళ్ళీ పెద్దగా అరిచింది.

"ఇవ్వాళ ఆ అమ్మాయి మళ్ళీ వచ్చింది. దాని అందమే అందం!"

సైనికుడు ఉలిక్కిపడి నిద్రలేచి ఆశగా అటువైపు పరుగు తీశాడు. ఈసారి కూడా అతడికి ఎవరూ కనిపించలేదు.

చిలకకు మాటలు నేర్పిన తర్వాత ఎప్పుడూ అబద్ధాలు చెప్పి ఎరగదు. సైనికుడు చిలకవంక చూసి నిద్రకు ఉపక్రమించాడు.

మర్నాడు అతడు టీ చేస్తుండగా మాటలు నేర్చిన చిలక మళ్ళీ అరిచింది.

"అబ్బ ! దాని ముఖమే ముఖం. ఎంత అందంగా ఉందో మెరుపు తీగలా- నన్ను చూసి మహా సిగ్గు పడుతోంది"

ఈ తఫా సైనికుడు జాగ్రత్తగా నిశితంగా చిలక చూస్తున్నవైపే చూశాడు.

అక్కడ చెట్టు కొమ్మ మీద సిగ్గులు ఒలక పోస్తూ మరో చిలక కూర్చుని ఉంది.

-జీవి




ప్రకృతి వరప్రసాదం మీ విశాల నయనాలు అందంగా, ఆరోగ్యవంతంగా వుంచండి

—ప్రకృతి బాటలో

సినెరారియా ష్వాబె




SWAIN

కంటి రక్షణకు నమ్మకమైన హోమియోపతి ఫార్ములా

మీకళ్ళకి చలవ; ఆరోగ్యంతోపాటు శుభ్రత కూడా

SCHWABE

డాక్టర్ విల్మర్ ష్వాబెగారిచే పశ్చిమ జర్మనీలో తయారీ, ప్యాకింగుచేయబడినది

Schwabe

నమ్మకమైన నేత్ర రక్షణదాయకి

అందరు ప్రముఖ కెమిస్టుల దగ్గర లభ్యమవుతుంది

అర్థాకళ్ళతోనే తనూ. తండ్రి కాలం వెళ్ళదీస్తున్నారు. ఏదో నాలుగు ట్యూషన్లు చెప్పుకోవడంవల్ల ఆమాత్రంగా నన్నా ఉంది. అటువంటి పరిస్థితిలో సుందరం ఆపద్బాంధవుడిలా కనిపించాడు. ఉద్యోగం ఇప్పిస్తా ననడమే గాక, ఇతరత్రా ప్రయత్నాలు చేసి డబ్బు పాడుచేసుకోవద్దని కూడా చెప్పాడు. నిజానికి వివిధ ఉద్యోగాలకి అప్లై చేసేటంతటి ఆర్థిక పరిస్థితి కాదు తనది. ఆ డబ్బుతో ఒక పూట భోజనం గడిచిపోతుంది. భగవంతుడి దయవల్ల ఏదైనా ఉద్యోగం తొందరగా దొరికితే బాగుండును. కాస్త ఊపిరి పీల్చుకోవచ్చు. తన తండ్రికి ఆయన ఆఖరి రోజుల్లో నన్నా పట్టెడన్నం పెట్టగలడు - చెప్పు తెగిపోవడంతో వినాయకరావు ఆలోచనలకి అంతరాయం కలిగింది. చెప్పు కుట్టించుకోవడం కన్నా పిన్నీసు పెట్టుకోవడం చవక. దగ్గరలో ఉన్న కిరాణా కొట్టువైపు నడిచా డతను.

"ఏమండీ ! ఆయన సంగతేమిటి?" సరిగ్గా ఆ సమయంలో తన భర్త నడిగింది శైలజ.

"వినాయకరావు గురించేనా నువ్వు అడిగేది? వెల్ ట్రై చేస్తాను - అవుతుందో లేదో చెప్పలేను."

"పాపం, ఆయన చాలా ఆశ పెట్టుకున్నాడు."

"డామిట్, దానికి నేనేం చేయను? అతనిని నన్ను నమ్ముకోమన్నానా? నా ఇంటి చుట్టూ తిరగమన్నానా? ఏదో అడిగాడు... చూద్దాం అన్నాను."

"అదేమిటండీ అలా అంటారు? మీరు కాదు..." ఏదో చెప్పబోయింది శైలజ.

"అబ్బా ! నాకు టైమవుతోంది. అన్నం పెట్టే ఏర్పాటు చేస్తావా, లేదా?" అన్నాడు సుందరం విసుగ్గా.

శైలజ మౌనంగా వంటింట్లోకి నడిచింది.

** ** **

వినాయకరావుకి దిన మొక యుగంలా నడుస్తోంది. తండ్రి శారీరక, మానసిక పరిస్థితులు చూస్తూంటే అతని గుండె తరుక్కుపోతోంది. అసలు తనకి ఎప్పటికైనా మోక్షం ఉందా, ఉద్యోగం అనేది వస్తుందా అనిపిస్తోంది అతనికి. ఆ రోజు ఏమీ తోచక బజారు కేసి బయలుదేరాడు. భారంగా అడుగులు వేస్తున్న అతనికి కాలులో రాయి గుచ్చుకుంది. అతని ప్రాణం జిలార్చుకుపోయింది. 'భగవంతుడా ! ఎక్కడున్నావయ్యా?' అని మనసులోనే అనుకున్నాడు. విచిత్రంగా అదే సమయానికి స్కూటర్ మీద వెడుతూ సుందరం కనిపించాడు.

"నమస్కారం సార్ !" చేతులు జోడించాడు వినాయకరావు.

"నమస్తే !" అంటూ స్కూటర్ ఆపాడు సుందరం.

వినాయకరావు మొహానికి నవ్వు పులుముకుంటూ - "ఏమిటి సార్ ఇలా వచ్చారు?" అని అడిగాడు.

"ఆఁ ! ఏదో బజారు పని ఉంటేనూ" స్కూటర్ మీద నుంచి దిగకుండానే సమాధానం చెప్పాడు సుందరం.

"నా విషయం ఏమైందిసార్? ఏమైనా తేలిందా?"

"ఆ విషయమే ఎం. డి.తో ఈ రోజు మాట్లాడదా మనుకున్నాను. కుదరలేదు. రేపో ఎల్లుండో మాట్లాడుతాను లెండి."

మా పరిస్థితి బాగాలేదు సార్. ఒక్కోసారి మా ఊరి ఫాక్టరీలో చేరిపోదామా అనిపిస్తుంది."

"అదేనండీ, మన వాళ్ళతో వచ్చింది ! చప్రాసీ ఉద్యోగమన్నా చేసేస్తాం అంటారు. మంచి ఉద్యోగం ఇప్పిస్తా నన్నానుగా కాస్త ఓపిక పట్టలేరూ?" అన్నాడు సుందరం కోపం, విసుగు మిళితమైన స్వరంతో.

"మీ రెలా చెపితే అలాగే సార్."

"చూస్తాను లెండి. వీలైనంత త్వరలో ఆర్డర్సు వచ్చేలా ప్రయత్నిస్తాను" అంటూ స్కూటరు స్టార్టు చేసుకుని, దుమ్ము లేపుకుంటూ వెళ్ళిపోయాడు సుందరం.

వినాయకరావు కళ్ళలో పడిన దుమ్ము తుడుచుకునే ప్రయత్నం చెయ్యసాగాడు.

** ** **

ఆ రోజు సాయంత్రం సుందరం ఒక ఫ్రెండు ఇంట్లో పార్టీ అటెండయి ఇంటికి ముఖం పట్టాడు. అతనికి చాలా విసుగ్గా ఉంది. స్కూటర్ రిపేరు కిచ్చి రెండు రోజు లయ్యింది. అసలు నడక అలవాటులేని కారణం చేత రిక్షాల మీదే తిరుగుతున్నాడు. ఆ రోజు రాత్రి తొమ్మి గంట లవుతోంది. సెకండ్ షో సినిమాల సమయం కావడం చేత రిక్షా దొరకలేదు.

ఆకాశం నిండా దట్టంగా మబ్బు కమ్ముకుంది. ఉండుండి మెరుస్తోంది. చల్లని గాలి వీయనారంభించింది. దానితో పాటు సన్నని తుంపర ప్రారంభం అయ్యింది.

సుందరం నడక వేగం పెంచాడు. క్షణాల్లో తుంపర భారీ వర్షంగా మారింది. ఆ చుట్టుపక్కల ఎక్కడా డాబాలు గానీ, పెంకుటిళ్ళు గానీ లేవు. ఇక తప్పదనుకుని ఎదురుగా ఉన్న పాక చూరుకింద చేరాడు సుందరం.

అది వినాయకరావు ఉండే ఇల్లు. అతను సుందరంని చూసి, గుర్తు పట్టి - "మీరా సార్? రండి లోపలికి రండి" అన్నాడు సంభ్రమంతో.

"పరవాలేదులెండి. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఈ వాన తగ్గేలా లేదు. ఏదన్నా రిక్షా వస్తే వెళ్ళిపోతాను. నా స్కూటర్ రిపేర్‌లో ఉంది" అన్నాడు సుందరం.

"సార్ !" వినాయకరావు ఏదో అనబోయాడు.

"మీ విషయం మరిచిపోలేదండీ. ప్రయత్నిస్తున్నాను" అన్నాడు సుందరం విసుగ్గా.

"అహఁ ! అది కాదు సార్. మీరు తడిసిపోతున్నారు. లోపలికి రండి" అన్నాడు వినాయకరావు నొచ్చుకుంటూ.

"లేదు, నేను వెళతాను."

"కానీ తడిసిపోతారు సార్ !"

"అదే ఆలోచిస్తున్నాను. పోనీ కాసేపు చూద్దాం" అంటూ లోపలికి నడిచాడు సుందరం.

సమయం గడిచిపోతోంది గానీ వాన తగ్గే సూచనలు లేవు.

"లాభంలేదు నే వెడతాను" అని బయలుదేరాడు సుందరం.

వినాయకరావు లోపలి నుంచి గొడుగు తెచ్చి ఇచ్చాడు. "కొంచెం దూరం వెడితే రిక్షా దొరకొచ్చు సార్. లేకపోయినా దీంతో ఇంటివరకూ వెళ్ళిపోవచ్చు." అన్నాడు వినాయకరావు గొడుగుని సుందరానికి అందిస్తూ.

"థాంక్స్. రేపో ఎల్లుండో ఇచ్చేస్తాను" అంటూ బయటికి నడిచాడు సుందరం. అతను వడివడిగా నడవడం ప్రారంభించాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి అతనికి పైనుంచి చినుకులు పడుతున్నట్లనిపించింది. క్రమంగా సుందరం తడిసిపోసాగాడు. అతనికి బలే కోపం వచ్చింది. తను గొడుగు వేసుకున్నా డన్నమాటే గానీ, దాని నిండా చిల్లులే. నీరు ధారలుగా కారి అతన్ని తడిపేస్తోంది.

'వినాయకరావు గొడుగంటూ ఓ చెత్తది తన మొహాన పడెయ్యకపోతే రిక్షా దొరికేకే బయలుదేరేవాడు, లేదా, వాన తగ్గేవరకూ వెయిట్ చేసేవాడు. ఈ గొడు గిచ్చి అటు తనను వర్షం తగ్గేవరకూ ఉండనివ్వలేదు. అలా అని తను తడవకుండా ఇంటికి చేరడు. గొడుగు అనేది ఎండనుంచీ, వాననుంచీ నీడ నివ్వాలి. కానీ, అది ఆ పని చెయ్యడంలేదు. త నున్నాను అంటూ అనవసరంగా భరోసా ఇచ్చి తనని పూర్తిగా తడిపేసింది. అది తనను వాన బారినుండి కాపాడుతుందని బయలుదేరితే పూర్తిగా మోసపోయాడు.'

ఆకాశంలో మెరుపు మెరిసింది. అది సుందరం మెదడులోకి ప్రవేశించింది - 'అవును తను కూడా చిల్లుల గొడుగు లాంటివాడే. వినాయకరావు లాంటివాళ్ళకు అనవసరంగా ఆశలు చూపించి, అటు ఉద్యోగం ఇప్పించడు. ఇటు వాళ్ళ ప్రయత్నాలను వాళ్ళను చేసుకోనివ్వడు. వాళ్ళు రెండిటికీ చెడిన రేవళ్ళు అవుతున్నారు.'

సుందరం చిల్లుల గొడుగుని చూసి కోపం తెచ్చుకోవడంలేదు. అలాంటి తనను చూసుకుని సిగ్గుపడుతున్నాడు. తనకి జ్ఞానోదయం కలిగించిన చిల్లుల గొడు గిచ్చిన వినాయకరావుకి మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

వినాయకరావు ఉద్యోగానికి గట్టి ప్రయత్నం చెయ్యాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాడు సుందరం. ★

## ఎడారి ఓడ

మోటారు కార్ల దగ్గర నుంచి విమానాల వరకు ప్రయాణ సాధనాలు ఎన్నో వచ్చిన ఈ రోజుల్లో కూడా మన దేశంలో ఎద్దుబండి తన ప్రాధాన్యాన్ని కోల్పోనట్లు, ఎడారిలో ప్రయాణానికి ఇప్పటికీ ప్రధానంగా ఒంటెలే దిక్కు. అందుకే దాన్ని ఎడారి ఓడ అంటారు. ఒంటెల పొట్టలో పెద్ద సంచీ ఉంటుందనీ, దానిని నీటితో నింపుకొని వారాల తరబడి ఉండగలదనీ అంటుంటారు. కాని ఇది నిజం కాదు. దీని పొట్టలో నీటి కోసం సంచీ ఏమీ ఉండదు. దాని సైజుకి తగ్గట్లుగా దాని దేహంలోని ప్రేగులూ ఉంటాయి. వాటిలోనే నీరు నిల్వ ఉంటుంది. అయితే ఒంటెకి చెమట పట్టకపోవడం మూత్రం కూడా చాలా తక్కువగా, అరుదుగా విసర్జించడం మూలంగా నీరు ఎక్కువ రోజులు దేహంలో ఉండగలుగుతుంది. క్లోజ్‌డ్ ఎయిర్‌కండిషనింగ్ సిస్టం ఉన్నట్లుగా దేహంలోని నీటిని పదే పదే రీసైకిల్ చేసుకుంటుందట.

ఇట్టి శక్తి ఉన్న కారణంగా ఒంటెలు శీతాకాలంలో అయితే ఎనిమిది వారాల వరకూ కూడా నీరు లేకుండా ఉండగలవు. తాగడం మొదలుపెట్టే కేవలం పది నిమిషాలలో 113 లీటర్ల నీటిని పట్టించేయగలవు.

-కె. ఆర్. కె. మోహన్